# పేకమేడ

ధర్మారావుని మేమంతాధర్మరాజనే పిలుస్తాం. కారణం లేకపోలేదు. పేక ముక్కల్ని చూస్తే ప్రపంచాన్నే మరచిపోయేవాడు. పోనీ తెలివిగా ఆడి ఏనాడైనా సంపాదించాడా అంటే అదీ లేదు. ఎంతో తెలివైన వాడిననుకునే శుద్ధ అమాయకుడు, నష్ట జాతకుడు. ఈ మధ్య వాళ్ళ ఊరు వెళ్ళినప్పుడు ఏదో కాలనీలో అద్దెకుంటున్నాడు. "దగ్గరగా ఏదైనా పోస్టాఫీసు ఉందా? ఉత్తరం పోస్టుచేసి వస్తాను" అన్నాను. "అదిగో ఈ వీధి చివరనే ఒక పేకమేడ



ఉంది. దాని వెనకాలనే పోస్టాఫీసు ఉంది" అన్నాడు. అలా వెళ్ళి వస్తూ పేకమేడ అని ఎందుకు పేరుపెట్టి ఉంటారా అని విశితంగా అటు చూశాను. ఏదో గట్టిగా ఊదితే కూలిపోయే అల్లాటప్పా మేడకాదు. ముందు వేపు ఇస్పేట్ ఆసు డిజైన్ వేసి అధునాతనంగా కట్టిన కాంక్రీట్ మేడ. ఆ మేడగురించి ధర్మారావు దగ్గర ప్రస్తావిస్తే "అదో చిత్రమైన కథలే; అది కట్టుకున్న దంపతులు ఇద్దరూ ఇద్దరే. ఎన్నెన్నో కాలనీలలో అద్దెకు ఉంటూ వచ్చి చివరకు పేకాటలో గెల్చిన సొమ్ముతో ఈ మేడ కట్టుకున్నారని అందరూ అంటారు. ప్రతి కాలనీలోనూ నాలాంటి పిచ్చివాళ్ళని రెచ్చగొట్టి పేకాట పిచ్చిలో పడేసి సర్వమంగళం పాడించేసేవారు" అన్నాడు నీరసంగా ఈర్ష్య పడుతున్న ధోరణిలో.

"అయితే మాత్రం: ఎప్పుడూ వాళ్ళే గెలవడం అసంభవం కదా" అన్నాను ఊరుకోలేక. "మన ఊరు రాజుగారు లేరు? ఆయనా ఆయన భార్యాపిల్లలూ అంతా తలోపార్టీ టిక్కట్టు మీదా ఎన్నికల్లో నిలబడేవారు. ఏ ఒక్కరూ గెల్చినా అధికార పక్షంలోనో, పలుకుబడి, రాజకీయ • బలం ఉన్న ఏ ప్రతిపక్షంలోనో సర్దుకుని కూర్చునేవారు. ఉమ్మడి ఆస్తుల్ని పెంచుకోవడమో, కనీసం పన్నుల బరువుకి కరిగిపోకుండా రక్షించుకోవడమో చేసేవారు. వీళ్ళ వ్యవహారమూ అంతే" అన్నాడు.

నాకు ఎందుకనో ఆ సమాధానం తృప్తికలిగించలేదు. తర్కానికి నిలబడదని తోచింది. ఊరుకోలేదు నేను. "వాళ్ళతో ఆడేవాళ్ళు కూడా ఒక కుటుంబ సభ్యులు ఆడితే వాళ్ళు కాదనలేరుగా" అన్నాను. ఆ పేకమేడ చూశాక ఆ దంపతులకు అనుకూలించే ప్రబలమైన కారణం ఏదో ఉంటుందనిపించింది. "వాళ్ళు ఏం ఉద్యోగం చేసేవారు?" అని అడిగాను. "ఏమో" అన్నాడు ధర్మరాజు ఉరఫ్ ధర్మారావ్. ధర్మారావు పెద్దకూతురు మా సంభాషణ ఒక చెవితో వింటున్నట్లుంది.

"చాలా కాలం వాళ్ళు ఇద్దరూ నేత్రావధానం చేస్తూ దేశమంతా తిరిగారు. వాళ్ళ ఇంట్లో ఎన్నో మెమెంటోలు, షీల్డ్‌లూ ఉన్నాయి" అంది నా ప్రశ్నకు జవాబుగా. ధర్మారావు కన్నా లౌకిక జ్ఞానం అతని పిల్లతరానికి ఎక్కువ ఉన్నందుకు కాస్త తృప్తి కలిగింది. ●

గిడుగు రాజేశ్వరరావు